క్లుప్తంగా

చెత్త సేకరణలో ప్రత్యేక దృష్టి సారించాలి

మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్



పిడుగురాళ్ల: మున్సిపల్ సిబ్బంది చెత్త సేకరణలో ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. పట్టణంలోని మెయిన్ రోడ్డులో చెత్త సేకరణ సిబ్బందికి గురువారం పలు సూచనలు, సలహాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బంది వ్యాపారస్తులకు అవగాహన కల్పించాలని, తడి, పొడి చెత్తను వేరు చేసే విధంగా చూడాలని, వాటిని మున్సిపల్ సిబ్బంది వచ్చినప్పుడు మాత్రమే ఇచ్చేలా తెలియజేయాలన్నారు. రోడ్డుపై వ్యాపారస్తులు చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

8న ఉచిత కంటి వైద్య శిబిరం

మాచర్ల : వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో ఈ నెల 8న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. ఓరుగంటి పురుషోత్తం సతీమణి సైదమ్మ జ్ఞాపకార్థం వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓల్డ్‌టౌన్, మాచర్ల శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు కంటి పరీక్షలు చేస్తారని వెల్లడించారు. శాంతిరామ్ మెడికల్ కాలేజ్ అండ్ జనరల్ హాస్పిటల్, నంద్యాలకు చెందిన వైద్యులు ఈ శిబిరంలో కంటి పరీక్షలు చేస్తారని, కంటి శుక్లం, కంటిపై పొర ఉన్న వారికి క్యాంపు జరిగిన రోజునే ఆపరేషన్లు చేయించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మాచర్ల పట్టణ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని కంటి పరీక్షలు చేయించుకోవాలని నిర్వాహకులు కోరారు. ఇతర వివరాలకు 9100510326, 9985750735 నంబర్లను సంప్రదించాలన్నారు.

రేపు మెగా పేరెంట్, టీచర్ మీట్

గురజాల : ఈ నెల 7వ తేదీన ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్, టీచర్ మీట్ నిర్వహించడం జరుగుతుందని ఎంఈవో–2 ఎం.సాంబశివరావు తెలిపారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఈ పేరెంట్ మీటింగ్ నిర్వహించడం జరుగుతుందని విద్యార్థుల నైపుణ్యాన్ని వారి తల్లిదండ్రులకు తెలియజేస్తామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఏమైనా సమస్యలు ఉంటే ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. ఈ మెగా పేరెంట్ మీటింగ్‌ను జయప్రదం చేయాలన్నారు.

ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన



మాచర్ల : మాచర్ల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సంఘ నాయకులు గురువారం నిరసన తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.కృష్ణారావు, గంగాధర్ బాబు, నజీర్, నాసరయ్య, రమేష్, శ్రీనివాసరావు, కొర్లయ తదితర ఉపాధ్యాయ సంఘ నాయకులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



సత్తెనపల్లి: సత్తెనపల్లి పట్టణంలోని అచ్చంపేట వెళ్లే మార్గంలో గల నిర్మలా నగర్ రైల్వే గేట్ సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గురువారం వెలుగు చూసింది. మృతుడి జేబులో క్రోసూరు మండలం ఉయ్యందన నుంచి సత్తెనపల్లి వచ్చిన బస్ టికెట్ ఉంది. ఈ ఘటన పై అనుమానాస్పద మృతిగా రైల్వే పోలీసులు. కేసు నమోదు చేసి మృతదేహన్ని సత్తెనపల్లి ఏరియా వైద్యశాల మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసినట్లయితే 7780171069 నెంబరులో సంప్రదించగలరని రైల్వే ఏఎస్ఐ వెంకట్రావు తెలిపారు.

పందులను గ్రామాల్లోకి వదిలితే చర్యలు

క్రోసూరు: క్రోసూరులో పందులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయని, అలా తిరిగితే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ జి.శ్రీనివాసరావు పందుల పెంపకందారులకు గురువారం నోటీసులు జారీ చేశారు. ఈసందర్భంగా వారి ఇళ్లకు వెళ్లి హెచ్చరించారు. పందులు వల్ల ప్రజలు అనారోగ్యాలకు గురవుతారని, రోడ్లపై మలమూత్రాలు విసర్జిస్తున్నాయని, వీధుల్లో ఇళ్ల ముందు ఎక్కడబడితే అక్కడ తిరుగుతున్నాయని అన్నారు. పందులను గ్రామంలో తిప్పటానికి వీలు లేదని హెచ్చరించారు. పందులు గ్రామంలో తిరుగుతున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ పాల్గొన్నారు.

ఐటీడీఏ ద్వారానే పనులు కల్పించండి

- కోరుతున్న చెంచు గిరిజనులు
- గతంలో పనికి ముందే సగం డబ్బులు
- ప్రస్తుతం పని పూర్తయిన నెల రోజుల తరువాత కూలీ జమ
- నిత్యావసరాలకు కూడా ఇబ్బందులు

వెల్దుర్తి: పల్నాడు జిల్లా మారుమూల ప్రాంతంలో ఉన్న నల్లమల్ల అటవీ ప్రాంతంలోని చెంచు గూడేలలో నివసిస్తున్న చెంచు గిరిజనులకు ఐటీడీఏ శ్రీశైలం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులు కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు. ఇక్కడ మొత్తం 23 చెంచు గూడేలలో 250 గ్రూపుల ద్వారా 2,500 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. గతంలో వీరికి ఐటీడీఏ శ్రీశైలం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులు కల్పించేవారు. శ్రీశైలం ఐటీడీఏ పరిధిలో జరిగే ఉపాధి హామీ పనులను చెంచు గిరిజనులు మాత్రమే చేసేవారు.

- ఐటీడీఏ కింద పనిచేసినపుడు వారికి టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ చెప్పిన కొలతల ప్రకారం పనిచేస్తే కూలీ డబ్బులను పనికి ముందే 50 శాతం ఉపాధి కూలీలకు ఇచ్చేవారు.

పని పూర్తయిన తరువాత మిగతా 50 శాతం డబ్బులను ఇచ్చేవారు. అలా ముందుగా ఇచ్చిన డబ్బులతో నిత్యావసర వస్తువులు కొనుక్కొని పనులు చేసుకునేవారు.

- 2022 వరకు చెంచు గిరిజనులకు ఐటీడీఏ ద్వారానే ఉపాధి హామీ పనులు కల్పించడం జరిగేది. 2023 నుంచి కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల ఉపాధి హామీ పనులను సాధారణ పనులలో కలిపింది.



ఉపాధి హామీ పనులు జరుగుతున్న దృశ్యం (ఫైల్ ఫొటో)

- కేంద్ర ప్రభుత్వం సాధారణ ఉపాధి హామీ పనులలో కలిపిన తరువాత పనులు పూర్తయిన తరువాతనే ఖాతాలలో కూలీ డబ్బులు జమ చేస్తున్నారు. పని పూర్తయిన 20 రోజుల తరువాత కూలీ డబ్బులు జమ చేస్తున్నారు. ఒక్కోసారి నెల రోజులు కూడా పడుతుంది. దీని వలన చెంచు గిరిజనులు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారు. మరలా ఐటీడీఏ ద్వారానే ఉపాధి హామీ పనులు చేయించాలని వారు కోరుతున్నారు.
- గతంలో ప్రత్యేకంగా ఐటీడీఏకు సంబంధించిన అధికారులు పనులు చేయించేవారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పనులు చేయిస్తున్నారు. బయోమెట్రిక్ విధానం ద్వారా ఉపాధి హామీ పనులు ఇస్తే మరింత మేలుగా ఉంటుందని, ప్రతి రోజూ కూలీ పనులకు వెళ్లి నిత్యావసరాలు తెచ్చుకోలేక అవస్థలు పడుతున్నామని వారు వాపోతున్నారు. సరుకుల కోసం పట్టణానికి, ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే పని మానుకొని వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో ప్రభుత్వమే తక్కువ ధరకు నిత్యావసర సరుకులను అందిస్తే ఆర్థిక ఇబ్బందులు ఉండవని వారు చెబుతున్నారు.

వెంటనే డబ్బులిచ్చేలా చర్యలు తీసుకోవాలి



ఐటీడీఏ పరిధిలో ఉపాధి హామీ పనులు చేసినపుడు వెంటనే డబ్బులు చెల్లించేవారు. ఇప్పుడు పని పూర్తయిన నెల రోజుల తరువాత ఖాతాలలో జమ చేస్తున్నారు. ఉపాధి కూలీలకు డబ్బులు లేక అప్పుల పాలవుతున్నారు. పని చేసిన వెంటనే డబ్బులిచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి. ఐటీడీఏ ద్వారానే ఉపాధి హామీ పనులు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– మండ్లి మల్లుస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు, మాచర్ల

సాధారణ ఉపాధి హామీ పనులు ఇబ్బందిగా ఉన్నాయి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పనులను చెంచు గిరిజనులకు ఇవ్వటం వలన కేటాయించిన పనులు పూర్తయిన తరువాత 20 రోజులకో లేక నెల రోజులకో డబ్బులొస్తున్నాయి. దీని వలన మాకు చాలా ఇబ్బందులున్నాయి. గతంలో లాగే ఐటీడీఏ ద్వారానే పనులు చేయించాలి.

– మండ్లి లక్ష్మమ్మ, రామచంద్రాపురం తండా

ఐటీడీఏ ద్వారా పనులు చేస్తే వెంటనే డబ్బులొస్తాయి



ఐటీడీఏ ద్వారా ఉపాధి పనులు చేస్తే వెంటనే డబ్బులొస్తాయి. దీని ద్వారా అధికారులు పనులిస్తే ఆ పనిని ఎంత త్వరగా పూర్తి చేస్తే అంత త్వరగా డబ్బులొస్తాయి. సాధారణ హామీ పనులు చేస్తే నెల రోజుల తరువాత డబ్బులొస్తున్నాయి.

– మండ్లి బయన్న, రామచంద్రాపురం తండా

నిత్యావసర సరుకులకు ఇబ్బందిగా ఉంది



రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఉపాధి హామీ పనులు చేస్తే నెల రోజుల తరువాత ఖాతాలలో డబ్బులు పడుతున్నాయి. ఈ నెల రోజులు మాకు నిత్యావసర సరుకులకు ఎంతో ఇబ్బందిగా ఉంది. అదే ఐటీడీఏ ద్వారా పనులు జరిగితే ముందుగానే డబ్బులిస్తారు. మాకు ఐటీడీఏ ద్వారానే ఉపాధి హామీ పనులు కల్పించాలి.

– మండ్లి మల్లేశ్వరి, రామచంద్రాపురం తండా

ముందుగా 50 శాతం డబ్బులను ఇస్తారు



చెంచు గిరిజనులకు ఐటీడీఏ ద్వారానే ఉపాధి హామీ పనులు కల్పించాలి. ఐటీడీఏ ద్వారా ఉపాధి పనులు జరిగితే ముందుగా 50 శాతం డబ్బులను ఇస్తారు. వాటి ద్వారా మేము మా కుటుంబాలకు కావాల్సిన సరుకులు కొనుక్కుంటాం. పని అయిన తరువాత మిగతా డబ్బులు ఇస్తే కుటుంబ అవసరాలు తీర్చుకుంటాం.


– మండ్లి బయన్న, రామచంద్రాపురం తండా

భూమిని కాపాడుకోవాలి



దాచేపల్లి : భూమిని కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందని ఏవో డి.పాపకుమారి అన్నారు. నడికుడి గ్రామంలో అంతర్జాతీయ మృత్తికా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. మట్టిని సమర్థవంతంగా ఉపయోగించుకోవటంతో పాటు సంరక్షించుకోవాలని ఏవో చెప్పారు. భూమిని కాపాడుకునేందుకు రసాయన ఎరువులకు బదులుగా జీవన ఎరువులు, పశువుల ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులను వినియోగించాలని ఆమె సూచించారు. అనంతరం రైతులకు మట్టి నమూనా పత్రాలు అందజేశారు.

సాయినాథునికి ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్(రెంటచింతల): మండల పరిధిలోని పాలువాయి జంక్షన్ వద్దనున్న షిరిడీ సాయి ఆలయంలో గురువారం భక్తులు ఆలయ అర్చకులు గోపాల్ పాండే ఆధ్వర్యంలో సాయిబాబాకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంతో మహిమ కలిగిన ఇక్కడ వేంచేసిన సాయిబాబాని పూజిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. భక్తులు పెద్ద సంఖ్యలో సాయిబాబాను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భజన బృందం బాబా గీతాలను ఆలపించారు. భక్తులకు దేవస్థానం చైర్మన్ పందిరి శ్రీనివాసరావు తీర్థ ప్రసాదాలను అందించారు. అన్న సంతర్పణ చేశారు.

ఉద్యమాలతోనే దళిత గిరిజనుల హక్కులు సాధ్యం

మాచర్ల: దళిత గిరిజన మహిళలకు ఆత్మగౌరవం, సంక్షేమం అభివృద్ధి జరగాలంటే ఉద్యమాల ద్వారానే సాధ్యమని జేబీపీ పార్టీ జిల్లా ఇన్‌చార్జి రాయపాటి ప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలో పెన్షన్ అసోసియేషన్ భవనంలో జేబీపీ పార్టీకి అనుబంధ సంఘం ఆధ్వర్యంలో కమిటీ ఎన్నికతో పాటు, సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బహుజన మహిళ లీడర్ రాయపాటి జయమ్మ అధ్యక్షత వహించారు. రాయపాటి ప్రసాద్ మాట్లాడుతూ జేబీపీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టిపాలెం వెంకటేష్ జాంబవ రాజు నాయకత్వంలో దాచేపల్లి మండలం బత్రుపాలెం గ్రామస్తులు రెండు గ్రూపు లీడర్లు మొత్తం 15 మంది సభ్యత్వం నమోదు చేయడం జరిగిందన్నారు. లక్ష్మీబాయి ఆధ్వర్యంలో బి.కుమారిబాయి సారథ్యంలో కమిటీని నియమించినట్లు తెలిపారు. డాక్టర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో కల్పించిన హక్కులను ఉద్యమాల ద్వారా సాధించుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయపాటి జయమ్మ మాట్లాడుతూ మహిళలపై దాడులు, అత్యాచారాలు చేసే వారికి కఠినంగా శిక్షపడేలా చట్టాలు చేయాలన్నారు. కార్యక్రమంలో మాచర్ల పట్టణ అధ్యక్షురాలు డేగల శాంతి, పల్నాడు జిల్లా కన్వీనర్ కడియం సత్తెమ్మ, డప్పు కళాకారుడు గౌరవ అధ్యక్షుడు ఆదిరాల సుందరరావు, కోళ్ల పేతురు, వేల్పుల మల్లయ్య, వేల్పుల కుమారి, రోజా, రత్నకుమారి, అక్కమ్మ, నోముల కుమారి, వేల్పుల సుందర్ లీల, వడ్లమూడి భూలక్ష్మి చౌదరి, చల్ల అంకమ్మ, కొమ్ము వెంకటమ్మ, కావూరి వసంత బహుజన మహిళా సంఘం లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

7న జెట్టిపాలెంలో అయ్యప్ప పడిపూజ

రెంటచింతల: మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో ఈ నెల 7న జెట్టిపాలెంలో అయ్యప్ప పడిపూజ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు గురుస్వామి బద్దూరి బ్రహ్మానందరెడ్డి గురువారం తెలిపారు. సాయంత్రం 6 గంటలకు 18 మెట్ల కలశపూజ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. నరసరావుపేటకు చెందిన కృష్ణ ఆర్కెస్ట్రాతో అయ్యప్ప నామ సంకీర్తన జరుగుతుందన్నారు. రాత్రి 10 గంటలకు స్వాములకు అల్పాహారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ గ్రామాలకు చెందిన మాలధారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించి అయ్యప్ప కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

మాచర్ల: పట్టణంలోని బీఎస్సార్ ఫంక్షన్ హాలులో అబ్దుల్ కలాం సేవా సమితి ఆధ్వర్యంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి హాజరయ్యారు. సేవా సమితి అధ్యక్షుడు షేక్ పాషావలి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు రూ.6 వేలకు పెన్షన్ పెంపు గొప్పతనం సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. దివ్యాంగులకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న షేక్ పాషావలిని అభినందించారు. గత 9 సంవత్సరాల నుంచి దివ్యాంగులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న మాచర్ల పట్టణ ప్రముఖ వైద్యులందరికీ, అతి తక్కువలో రక్త, ఇతర పరీక్షలు నిర్వహిస్తున్న ల్యాబ్ యజమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాచర్ల మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, టీడీపీ సీనియర్ నాయకులు యనమల కేశవరెడ్డి, పల్నాడు ప్రతిభ వికాస్ కాలేజీ డైరెక్టర్ పఠాన్ నాగూర్ వలిలు మాట్లాడారు. అనంతరం దివ్యాంగులకు హెల్త్ కార్డులు అందజేశారు. పేద వికలాంగులకు ప్రతిభ జూనియర్ కాలేజీ విద్యార్థులు సేకరించిన బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల సంఘం నాయకులు చాకలి ఐలమ్మ సేవా సమితి అధ్యక్షుడు మన్నెం పాండురంగారావు, జనసేన నాయకులు రామకృష్ణ, దాతలు వేముల శ్రీనివాసరావు, ఆవుల వెంకటేశ్వర్లు, త్యాగరాజ సంగీత కళాశాల ఉపాధ్యాయులు చిన్న లాలు సాహెబ్, దివ్యాంగ నాయకులు అంజిబాబు, శివశంకర్, మను, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

తహసీల్దార్ బత్తుల వాణి



మాచర్ల రూరల్: గ్రామ స్థాయిలో రైతుల భూములకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించాలనే ప్రాథమిక లక్ష్యంతో గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బత్తుల వాణి తెలిపారు. గురువారం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నేటి నుంచి వచ్చే జనవరి 2 వరకు గ్రామ పంచాయతీలలో సదస్సులు జరుపుతున్నామని అన్నారు. 6న గన్నవరం, 7 కంభంపాడు, 10 ముత్యాలంపాడు, 11 రాయవరం, 12 జమ్మలమడక, 13 కొత్తపల్లి, 17 భైరవునిపాడు, 18 కొప్పునూరు, 19 లచ్చంబావి, 20 నాగులవరం, 21 విజయపురిసౌత్, 24 చింతలతండా, 26 పశువేముల, 27 కొత్తూరు, 28 ఏకోనాంపేట, 31 తాళ్ళపల్లి, జనవరి 2న మాచర్ల మున్సిపల్ కార్యాలయంలో సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో రెవెన్యూకు సంబంధించిన మ్యుటేషన్, ఎల్ఈసీ కార్డుల మంజూరు, భూ తగాదాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణ, 22ఏ తారుమారు మొదలైన సమస్యలపై ఫిర్యాదులు తీసుకొని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత రైతులందరూ పాల్గొనాలని కోరారు.

దాచేపల్లి మండలంలో...

దాచేపల్లి : మండల వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ వైపీ కుటుంబరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6న తంగెడ, 10న భట్రుపాలెం, కాట్రపాడు, 11న మాదినపాడు, సారంగపల్లి అగ్రహారం, 12న రామాపురం, శ్రీనగర్, 13న పొందుగల, 17న గామాలపాడు, శంకరపురం, 18న నడికుడి, 19న దాచేపల్లి, 20న అలుగుమల్లెపాడు, 21న కేసానుపల్లి, తక్కెళ్లపాడు, 24న పెదగార్లపాడు, 27న ముత్యాలంపాడు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రైతు సమస్యలపై అర్జీలు ఈ సదస్సుల్లో అందించాలని ఆయన కోరారు.

వెల్దుర్తి: నేటి నుంచి వెల్దుర్తి మండల రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహసీల్దార్ జానీబాషా గురువారం స్థానిక కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సదస్సులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు. రెవెన్యూ సమస్యలున్న వారు ఈ సభల్లో దరఖాస్తులు అందిచాలని అన్నారు. ఈ నెల 6న వెల్దుర్తి, 10న గుండ్లపాడు, 11న బోదిలవీడు, 12న మండాది, 13న రచ్చమల్లపాడు, 17న శ్రీరాంపురంతండా, 18న పట్లవీడు, 19 శిరిగిరిపాడు, 20 వజ్రాలపాడు, గంగలకుంట, 21న లోయపల్లి, మిట్టమీదిపల్లె, 24 హనుమాపురంతండా, రామచంద్రాపురం తండా, 26 గొట్టిపాళ్ళ, మరసపెంట, 27న కొత్తపుల్లారెడ్డిగూడెం, 28న కండ్లకుంట, జనవరి 2న ఉప్పలపాడు, 3న చినపర్లపాయితండా గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయి.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

తహసీల్దార్ కె.నగేష్

గురజాల : రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కె.నగేష్ గురువారం తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీ నుంచి 2025 జనవరి 1వ తేదీ వరకు సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటామని రైతులు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. 6వ తేదీన గొట్టిముక్కల, 10న తేలుకుట్ల, 12న పులిపాడు, 17న గంగవరం, 19న పల్లెగుంత, 21న గోగులపాడు, 24న గురజాల, 28న చర్లగుడిపాడు, 31న మాడుగుల, 2025 జనవరి 1న దైద గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బోదవ్యాధి నిర్మూలనకు రక్త నమూనాల సేకరణ



పిడుగురాళ్ల: పట్టణంలోని వార్డులలో, మండలంలోని జూలకల్లు గ్రామంలో బోదవ్యాధి నిర్మూలన కోసం రక్త నమూనాల సేకరణ కార్యక్రమాన్ని గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని జూలకల్లు గ్రామంలోని ఎస్సీ కాలనీలో 93 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఈ నమూనాలను పరీక్షించేదుకు ల్యాబ్‌కు పంపిస్తారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది జానిమేరా, జి.వెంకట రావమ్మ పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

గురజాల: విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వై.వినోద్ కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పల్లెగుంత గ్రామానికి చెందిన విద్యార్థిని గురజాలలోని ఒక ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యనభ్యసిస్తుంది. రోజులాగే 4వ తేదీ ఉదయం ఇంటి నుంచి కళాశాలకు బయలుదేరింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో కళాశాల నుంచి విద్యార్థిని తండ్రికి కళాశాలకు ఎందుకు రాలేదని ఫోన్ రాగా కళాశాలకు వచ్చిందని సమాధానం చెప్పాడు. దీంతో కళాశాల సిబ్బంది కళాశాలకు రాలేదని సమాధానం ఇచ్చారు. వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు వెతకగా ఎక్కడా ఆచూకి లభించలేదు. దీంతో గురువారం సాయంత్రం తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆకట్టుకుంటున్న క్రిస్మస్ స్టార్స్

రంగు రంగుల కాగితాలు... సాయంత్రం అయ్యే సరికి కను విందుగా ఆకాశంలో నక్షత్రాల మాదిరిగా క్రిస్మస్ స్టార్స్ జిగేల్ జిగేల్ మంటూ మెరుస్తున్నాయి. పట్టణంలో, గ్రామాల ప్రధాన వీధుల్లోను, చర్చిల వద్ద, క్రిస్టియన్స్ ఇంటిపైన, ఇంటి ముందు ఇలా ఎటు చూసినా రంగు రంగుల క్రిస్మస్ స్టార్స్ కనువిందు చేస్తున్నాయి. క్రిస్మస్ నెల ప్రారంభం కావడంతో ప్రతి వీధిలోనూ క్రిస్మస్ స్టార్స్ ఆకట్టుకుంటున్నాయి.

– పిడుగురాళ్ల



తెలుగు బాప్టిస్ట్ చర్చి వద్ద ఏర్పాటు చేసిన స్టార్



పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్టార్

ఉపాధ్యాయుడిపై దాడి అమానుషం

ఫ్యాప్టో మండలశాఖ ప్రతినిధులు

అచ్చంపేట: రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయుడు ఇజాజ్ అహమ్మద్‌పై కొంత మంది విద్యార్థులు దాడిచేయడంపై ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ (ఫ్యాప్టో)విచారం వ్యక్తంచేసింది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం ఎంఈఓ ఏకుల ప్రసాదరావుకు వినతిపత్రం అందచేశారు. వారు మాట్లాడుతూ ప్రధానంగా పాఠశాల ఆవాస ప్రాంతంలో గంజాయి సంస్కృతి ఉన్నట్లు తెలుస్తోందని, ఆ ప్రభావం పాఠశాల విద్యార్థులపై పడి ఉండవచ్చని వారు అనుమానం వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితి చాపకింద నీరులా మరికొన్ని ప్రాంతాలకు వ్యాపించే అవకాశం ఉందన్నారు. విద్యార్థులలో అగ్రెసివ్ నేచర్ పెరగడం, బాలికల పట్ల అనుచితంగా వ్యవహరించడం, ఉపాధ్యాయులను కించపరచడం లాంటి విపరీత ధోరణులు పెరుగుతున్నాయన్నారు. ఈ విష సంస్కృతిని ప్రభుత్వమే అరికట్టాలని, న్యాయ విచారణకు ఆదేశించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని, ఉపాధ్యాయుని కుటుంబానికి న్యాయం చేయాలని ఫ్యాప్టో ప్రతినిధులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో ప్రతినిధులు జి.గంగయ్య, బత్తుల సాంబశివరావు, తుమ్మా శౌర్రెడ్డి, గనుపల్లి సునీల్, బి.రామారావు, ఎంవీ రామానాయక్, ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వామ్యం కావాలి



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): సామాజిక సేవ విద్యలో భాగమేనని, విద్యార్థి దశ నుంచే సామాజిక సేవ అలవర్చుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విజయ్‌కుమార్ చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా గురువారం ఎన్ఎస్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ సామాజిక సేవ ద్వారా విద్యార్థులకు నాయకత్వ లక్షణాలతో పాటు సామాజిక అభివృద్ధిపై అవగాహన పెరుగుతుందన్నారు. గ్రామంలో వారం రోజులు పాటు సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. కళాశాల ఏఓ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఏఓ ఎం.అరుణ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రవల్య, వీఏఏ శైలజ పాల్గొన్నారు.